జెండాపై నిర్లక్ష్యం

● శిథిలమవుతున్న ఆకారం



జాతీయ జెండా నమూనాలో పెరిగిన పిచ్చి మొక్కలు

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మున్సిపాల్టీ పరిధిలోని కొట్నూరు చెరువు మరువ వద్ద మువ్వన్నెల జెండా ఆకారాన్ని అందంగా రూపొందించారు. సాయంత్రం వేళ కట్టపై తిరిగేవారు లేదా రోడ్డుపై వచ్చేవారు అక్కడికి వెళ్లి సేదతీరేందుకు సిమెంటు బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. నిర్వహణ చక్కగా ఉండటంతో ఆప్రాంతం చాలా అందంగా, ఆహ్లాదంగా కనిపించేది. ఇదంతా అప్పటి మున్సిపల్ కమిషనర్ హయాంలో పరిస్థితి. తర్వాత కమిషనర్‌గా వచ్చినవారు దీన్ని అసలు పట్టించుకోలేదు. దీంతో నిర్వహణ కొరవడి జెండా ఆకారంలో గడ్డి పెరిగింది. బెంచీలు పాడైపోయాయి. చుట్టూ ముళ్ల కంపలు పెరిగాయి. లక్షల ప్రజాధనం ఖర్చు పెట్టి



ధ్వంసమైన సిమెంటు బెంచి

చేసిన ఏర్పాట్లు వృథాగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు, పాలకవర్గం తీరుపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆగస్టు 15నాటికైనా ఇక్కడ శుభ్రం చేసి మెరుగులు దిద్దాలని కోరుతున్నారు. - ఆంధ్రజ్యోతి, హిందూపురం

ఒకే రోజు 10 ఇళ్లలో చోరీ

● భారీగా బంగారం, నగదు అపహరణ
● సత్యసాయి ఆస్పత్రి స్టాఫ్ క్వార్టర్స్‌లో చొరబాటు
● పోలీసుల పనితీరుపై తీవ్ర విమర్శలు

7



దొంగలు పగులగొట్టిన బీరువా

ప్రతి కుటుంబ అభివృద్ధే లక్ష్యం

సుపరిపాలనపై ఇంటింటికి వెళ్లి ప్రచారం
ఒక్కొక్కటిగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం
జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని



బిసలమానేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

చిలమత్తూరు/లేపాక్షి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని నల్లరాళ్లపల్లిలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సుపరిపాలనను గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? సమస్యలు ఏవైనా ఉన్నాయా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర అభివృద్ధిని మరచిపోయిందని విమర్శించారు. దాంతో ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిని పునర్నిర్మించాల్సి వస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజలకు సుపరిపాలన అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపర్చి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా (మిగతా 6వ పేజీలో...)

ఏకగ్రీవం

● మడకశిర నగర పంచాయతీ టీడీపీ వశం
● చైర్మన్‌గా నరసింహరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా ప్రభావతి



చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌లకు డిక్లరేషన్ ఇస్తున్న పెనుకొండ ఆర్డీఓ

మడకశిర/ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ చైర్మన్ పదవి టీడీపీ వశం అయింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ వ్యవహరించారు. మొత్తం నగర పంచాయతీలో 20మంది కౌన్సిలర్లు ఉండగా ప్రత్యేక సమావేశానికి 14మంది హాజరయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు హాజరయ్యారు. చైర్మన్ పదవికి టీడీపీకి చెందిన 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజు, వైస్ చైర్మన్ పదవికి 4వ వార్డుకు చెందిన ప్రభావతి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్‌కు డిక్లరేషన్ పత్రాలు అందించిన అనంతరం ఆర్డీఓ వారిద్దరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఇన్నాళ్లు వైసీపీ చేతిలో ఉన్న నగర పంచాయతీ టీడీపీ చేతిలోకి రావడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. కాగా మడకశిరలో నడిపించే నాయకుడు లేక వైసీపీ రోజు రోజుకు బలహీనపడుతోంది. నియోజకవర్గంలో పట్టుకోల్పోతోంది. ఇప్పటికే ఆపార్టీకి చెందిన పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు టీడీపీలో చేరిపోయారు. తాజాగా నగర పంచాయతీని చేజార్చుకోవడం ఆ పార్టీ బలహీనతకు అద్దం పడుతోందన్న చర్చ నడుస్తోంది.

దశ తిరిగేనా..?

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనకు హల్కూరు ఎంపిక

ఆంధ్రజ్యోతి విజిట్

రూ.20 లక్షలు మంజూరు చేయనున్న కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వ సాయం అదనం.. గ్రామస్థుల హర్షం



హల్కూరు గ్రామం

మడకశిర/అమరాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేయూతతో తమ గ్రామానికి మహర్దశ పట్టనుందని హల్కూరు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అమరాపురం మండలంలోని హల్కూరు గ్రామం ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజనకు ఎంపికైన విషయం తెలిసిందే. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో 2255 మంది జనాభా ఉంది. ఈ గ్రామం మండల కేంద్రానికి దగ్గరగా ఉన్నా అభివృద్ధికి మాత్రం దూరంగానే ఉంది. గ్రామం లో 15 సంవత్సరాల కిందట వేసిన సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా అంతంత మాత్రమే. వక్క, ఆకు తోటల్లో పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. గతంలో గ్రామాన్ని ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపిక చేయాలని పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అడగకుండానే చేర్చారని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పై మురుగు నీటి ప్రవాహం

గ్రామ అభివృద్ధి కోసం రూ.20 లక్షలు

ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన కింద ఎంపికైన హల్కూరు గ్రామాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేస్తుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తగినన్ని నిధులు కేటాయించి గ్రామాభివృద్ధి పనులను చేస్తుందన్నారు. విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఆమోదం కోసం జిల్లా స్థాయి అధికారులు సంబంధిత అధికారులతో చర్చించినట్లు తెలిపారు. విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా అంగన్‌వాడీ భవన నిర్మాణం, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, ఎస్‌హెచ్‌జీ రీసోర్స్ సెంటర్ పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

సంతోషంగా ఉంది



ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద మా ఊరు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని అందించాలి. గ్రామంలో అంబేడ్కర్ భవనం, అంగన్‌వాడీ సెంటర్ నిర్మించాలి. శ్మశాన వాటికి స్థలం మంజూరు చేయాలి.
- పూజారి రఘువీర్, గ్రామస్థుడు

అభివృద్ధి కుంటుపడింది



గత ప్రభుత్వంలో నిధులు రాకపోవడంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలి. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద మా ఊరు ఎంపిక కావడంతో అభివృద్ధి జరుగుతుందనే ఆశ కలిగింది. - హనుమక్క, సర్పంచ్



దెబ్బతిన్న సీసీ రోడ్డు

● గ్రామంలో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, ఆర్వోప్లాంట్, రీసోర్స్‌భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీ కార్యదర్శి గౌరమ్మ తెలిపారు.

అరసెంటు వివాదం పరిష్కారం

● వృద్ధురాలికి మరో చోట ఇంటి స్థలం కేటాయింపు



దొడగట్ట జగనన్న లే అవుట్‌లో ప్లాటును చూపిస్తున్న రెవెన్యూ అధికారులు

రొద్దం, జూలై 16(ఆంధ్రజ్యోతి): అరసెంటు స్థలం వివాదాన్ని రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. ఈ స్థలం కోసం 60 ఏళ్ల వృద్ధురాలు 16ఏళ్లుగా దాయాదులతో పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. మండలంలోని దొడగట్ట గ్రామంలో 228 సర్వే నంబరులో ఉన్న అరసెంటు స్థలం కోసం ఇమాంబి కోర్టుకు వెళ్లారు. ఆమెకు అనుకూలంగా కోర్టు 2009లో తీర్పు ఇచ్చింది. తన స్థలానికి హద్దులు చూపమని రెవెన్యూ అధికారులను ఆమె అడిగారు. అయితే వారు స్పందించలేదు. ఆమె విషయం తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' జూన్ 17న అరసెంటు స్థలం కోసం వృద్ధురాలి పోరాటం శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీనికి తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు స్పందించారు. ఇరువర్గాలకు నోటీసులు అందించి, బుధవారం సర్వే సిబ్బందితో వెళ్లి కొలతలు వేయించారు. అయితే ఇమాంబికి ఆరడుగుల స్థలం మాత్రమే మిగలడంతో నచ్చజెప్పి జగనన్న లేఅవుట్‌లో 34వ నంబరు ప్లాటు 1.5సెంట్ల స్థలానికి పట్టా ఇస్తామని చెప్పారు. దీనికి వృద్ధురాలు అంగీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కవిత, వీఆర్‌ఓ గోపాల్, సర్వేయర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ నిశ్చల్‌పై సస్పెన్షన్ వేటు

కొండూరు వేణు.. మరో నలుగురిపై కూడా..

క్రమశిక్షణ ఉల్లంఘనల పేరిట వైసీపీ చర్యలు



నవీన్ నిశ్చల్



కొండూరు వేణుగోపాలరెడ్డి

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నవీన్ నిశ్చల్‌ను వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఆయనతోపాటు పార్టీ హిందూపురం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి, బి.బ్లాక్ అధ్యక్షుడు సీఎన్‌పీ నాగరాజు, 17, 31 వార్డు కౌన్సిలర్లు మజాన్, చిన్నమ్మ, పార్టీ నాయకుడు హబీబ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ప్రకటించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు సన్నిహితులైన నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడటం పార్టీలో కలకలం రేపుతోంది. ఈ నెల 8న వైఎస్సార్ జయంతిని హిందూపురంలో పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోయి నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పార్టీ కార్యాలయం వద్ద, నవీన్ నిశ్చల్ టీచర్స్ కాలనీలో నివాళులు (మిగతా 6వ పేజీలో...)

రావమ్మా.. తుంగభద్రమ్మా..

నేడు హెచ్చెల్సీకి నీటి విడుదల (6లో....)

హంద్రీనీవా సిద్ధం

నేటి నుంచి ఎత్తిపోతలు ప్రారంభం

● పనులను తనిఖీ చేసిన ఎస్ఈ ● మిగిలిన పనులు వచ్చే సీజన్‌లోనే..
● నీటి పారుదలకు తొలగిన ఆటంకాలు



జి.కొట్టాల వద్ద హంద్రీనీవా కాలువలో పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నీటి ఎత్తిపోతలకు హంద్రీనీవా కాలువ సిద్ధమయింది. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ఇంజనీరింగ్ అధికారులు రికార్డు స్థాయిలో పూర్తి చేయించారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్టుగానే కాలువ వెడల్పు పనులను అనుకున్న సమయానికే పూర్తిచేశారు. వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవాలో తట్ట మట్టినీ తీయలేదని ఎద్దేవాచేసిన టీడీపీ నేతలు.. తాము చేసి చూపుతామని ఇచ్చిన హామీ మేరకు అనుకున్న సమయానికే వెడల్పు పనులను పూర్తిచేసి చూపారు. వెడల్పు పనులు కొంత మేరకు మిగిలి ఉన్నాయి. బండ్ వైడెనింగ్, డీప్‌కట్ వైడెనింగ్ పనులు వంద శాతం పూర్తిచేయగా.. బండ్ లైనింగ్ పనులు కొంతమేర జరిగాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో హంద్రీనీవాకు ఎత్తిపోతలు ప్రారంభమయ్యే సమయం సమీపించడంతో లైనింగ్ పనులను నిలిపివేశారు. గురువారం మల్యాల 1వ నంబరు పంప్ హౌస్ వద్ద నీటి ఎత్తిపోతల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు హంద్రీనీవా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ స్వరూప్ కుమార్ (మిగతా 6వ పేజీలో..)

డప్పు కొట్టకపోతే దాడి చేస్తారా ?

● ఎస్సీ జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుళ్లాయప్ప

ధర్మవరం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా డప్పు కొట్టకపోతే దళితులపై దాడి చేస్తారా? అని ఎస్సీ జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసగానపల్లి కుళ్లాయప్ప ప్రశ్నించారు. మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో ఆయన ప్రజాసంఘాల నాయకులతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలోకి వెళ్లి అక్కడ ప్రజలతో మాట్లాడి జరిగిన విషయంపై ఆరాతీశారు. మొహర్రం పండుగ సందర్భంగా దాడులు చేశారని, మా కాలనీ రహదారికి ముళ్లకంపలు అడ్డువేశారని పలువురు ఎస్సీలు వారి దృష్టికి తెచ్చారు. ఎవరూ అధైర్యపడవద్దని అండగా ఉంటామని కుళ్లాయప్ప భరోసా ఇచ్చారు. నేటి కాలంలో కూడా గ్రామాల్లో కులవ్యవస్థతో ఇలాంటి సంఘటనలు జరగడం దారుణమన్నారు. ఎస్సీలను ఇబ్బంది పెట్టిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ ఎమ్మెస్ ఆదినారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు కేశగాళ్ల వెంకటేష్, ఎస్సీ జనసంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ మాల్యవంతం రాంప్రసాద్, నాయకులు సాకే కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



సుబ్బరావుపేట ఎస్సీకాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సీ జనసంఘం, ప్రజాసంఘాల నాయకులు

రావమ్మా.. తుంగభద్రమ్మా..!

నేడు హెచ్చెల్సీకి నీటి విడుదల

రాయదుర్గం, జూలై 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)కి గురువారం నీరు విడుదల చేయనున్నట్లు బోర్డు ఎస్ఈ నారాయణనాయక్ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కర్ణాటకకు సంబంధించిన వాటా నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. వారం క్రితం నీరు విడుదల చేయడంతో ఆంధ్ర సరిహద్దులోని 105 కి.మీ. వద్ద జలాలు వచ్చి నిలువ ఉన్నాయి. కర్ణాటక వాటా కింద రోజుకు 700 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర వాటా కింద రోజుకు 500 క్యూసెక్కుల నీరు వదలాలని హెచ్చెల్సీ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి బుధవారం సాయంత్రం బోర్డుకు ఇండెంట్ సమర్పించారు. దీంతో గురువారం ఉదయం ముహూర్తం చూసుకుని సరిహద్దులో నిల్వ ఉన్న జలాలను దించిన రెగ్యులేటర్‌ను ఎత్తి, ఆంధ్ర జలాలను విడుదల చేసేలా బోర్డు సరిహద్దు డీఈకి ఆదేశించారు. కాలువ మరమ్మతులు, అడ్డుగా ఉన్న మట్టి, రాళ్ల తొలగింపు పూర్తవడంతో నీరు విడుదల చేయనున్నారు. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేదని క్షేత్రస్థాయి అధికారులు కాలువపై గస్తీ నిర్వహించి, గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో గురువారం నుంచి హెచ్చెల్సీ జలాలు ఆంధ్రలో ప్రవహించనున్నాయి.

మార్గదర్శకుల గుర్తింపు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పీ4 అమలులో భాగంగా మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలనీ, లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి పీ4 కార్యక్రమంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పీ4 కింద జిల్లాలో 68,381 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇందులో దాతల (మార్గదర్శకుల)కు ఇప్పటివరకు 18,396 మందిని దత్తత ఇచ్చామన్నారు. ఇంకా 45,985 మంది బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందు కోసం మార్గదర్శకులను గుర్తించాలనీ, ఈ విషయంలో అవగాహన కల్పించాలని కలెక్టర్ వివరించారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

అనంతపురం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలను 15రోజుల్లోగా సంబంధిత అన్ని శాఖల అధికారులు తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలన్నారు. తనిఖీ విషయంలో అలసత్వం ఉండరాదన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తహసీల్దార్ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలన్నారు. అభివృద్ధి పనులకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పిల్లలకు నాటు వైద్యం వద్దు

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, నాటు వైద్యాన్ని పురిటిపిల్లలపై ప్రయోగించడం ద్వారా ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. జూన్‌లో మాతాశిశు మరణాలపై బుధవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి మాట్లాడుతూ.. శిశు, మాతృ మరణానికి కారణాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. అలాంటి సమస్యలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం ఆరువారాల నుంచి, ఆరు నెలలపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని సంపూర్ణంగా తీసుకుంటే రక్తహీనత దరిచేరదన్నారు. గర్భిణులకు అన్నిరకాల ఆరోగ్యపరీక్షలు సక్రమంగా నిర్వహించి, ఎప్పటికప్పుడు తగిన వైద్యసేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు యుగంధర్, మధుసూదన్, ప్రణీత్, ఇందిర, సీహెచ్ఓలు పాల్గొన్నారు.

బడిలో బువ్వ కష్టాలు..!





క్యారియర్ తెచ్చుకుని భోజనం తింటున్న విద్యార్థులు

- దర్శినమల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల అవస్థలు
- మానేసిన భోజన ఏజెన్సీ నిర్వాహకులు
- 9 రోజులు వండి వడ్డించిన ఉపాధ్యాయులు
- తర్వాత చేతులెత్తేసిన వైనం
- ఇంటి నుంచే క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

ధర్మవరంరూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి):మండలంలోని దర్శినమల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వదిలేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఉపాధ్యాయులే 9 రోజులపాటు వంట వండి, వడ్డించారు. వారు కూడా ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. సమస్యను ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే క్యారియర్లు తెచ్చుకుని, భోజనం చేయాల్సి వచ్చింది. దీంతో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు.. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎంఈఓ గోపాల్‌నాయక్ పాఠశాలకు చేరుకుని ఆరాతీశారు. గ్రామపెద్దలతో మాట్లాడి రామాంజనేయులు అనే వ్యక్తికి తాత్కాలికంగా ఏజెన్సీ నిర్వహణను అప్పగించారు.

దీపం సొమ్ము అందరికీ అందేలా చూడండి

- టీడీపీ నాయకులకు రఘువీరా సూచన



మాజీ మంత్రి రఘువీరారెడ్డికి కరపత్రాలు ఇస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, జూలై16 (ఆంధ్రజ్యోతి): సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, టీడీపీ నాయకుల మధ్య ఆసక్తికర సంభాషణ సాగింది. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలకంఠాపురం గ్రామంలోని రఘువీరా ఇంటికి టీడీపీ నాయకులు బుధవారం వెళ్లారు. వారిని రఘువీరారెడ్డి ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని టీడీపీ నాయకులు అందజేశారు. దానిని తీసుకున్న రఘువీరా.. అందులోని పథకాలన్నింటినీ క్షుణ్ణంగా చదివారు. 'అన్నీ బాగున్నాయి కానీ, కొంత మందికి దీపం పథకం కింద గ్యాస్ సబ్సిడీ డబ్బులు జమ కాలేదనీ, వారికి వచ్చేలా చూడాల'ని నాయకులకు సూచించారు. దీంతో వారు సరేనంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవి, రంగేగౌడ్, ఆనంద్, రాజు, గోవర్ధన్, రంగనాథ్ పాల్గొన్నారు.

26 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు

శెట్టూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకొడికి గ్రామానికి చెందిన 26 మందిపై పోలీసులు బుధవారం ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పీర్ల చావిడిలోకి ఎస్సీలు రాకూడదని బీసీ వర్గానికి చెందిన వారు శనివారం వాదనకు దిగారు. దళిత వర్గానికి చెందిన గంగాధర్ చావిడిలోకి వెళ్లేందుకు యత్నించగా.. బీసీ వర్గానికి చెందిన 26 మంది.. అతడిపై దాడి చేసి, గాయపరిచారు. దీనిపై బాధితుడు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా పోలీసులు.. దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడంతో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బాధితులు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో దాడి చేసిన 26 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ రాంభూపాల్ తెలిపారు.

జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

అనంతపురం కలెక్టరేట్ జూలై 16(ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రిడిటేషన్లు కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం కింద రూ.1250 www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలన్నారు. జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రతి కుటుంబ అభివృద్ధే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

లభిస్తాయన్నారు. ప్రతి గ్రామానికి శ్మశానవాటికను ఏర్పాటు చేస్తామన్నారు. ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కార్యక్రమం చేపడతామన్నారు. దివంగత ఎన్టీఆర్ హిందూపురం ప్రాంత అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన అడుగుజాడల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ నడుస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో హిందూపురం ప్రాంతం మెగా పారిశ్రామిక వాడగా నిలుస్తుందన్నారు. అంతకుముందు ఆయనకు ఎంపీ పార్థసారధి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కల్లుకుంట అంజినప్ప, మండల కన్వీనర్ శ్రీనివాసులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు.



చిలమత్తూరు మండలం నల్లరాళ్లపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

లేపాక్షి మండలంలోని బిసలమానేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావుతో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లారు. కరపత్రాలను అందిస్తూ ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. రెండు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు డాక్టర్ సురేంద్ర, కోడూరు సర్పంచ్ మురళీమోహన్, గంగాధర్, కురుబ చంద్రశేఖర్ లేపాక్షి నాయకులు గ్రీన్‌పార్క్ నాగరాజు, మండల కన్వీనర్ వెంకటాపురం అభి, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నవీన్ నిశ్చల్‌పై సస్పెన్షన్ వేటు

(5వ పేజీ తరువాయి)

అర్పించారు. కొండూరు వేణుగోపాలరెడ్డి మరోచోట కార్యక్రమం నిర్వహించారు. అదే రోజు హిందూపురానికి వచ్చి పార్టీ పరిశీలకుడు రమేష్ రెడ్డి, క్రమశిక్షణ ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విషయాన్ని పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీపిక, ఆమె భర్త వేణురెడ్డి బుధవారం తాడేపల్లికి వెళ్లి జగన్‌ను కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ వ్యవహారల గురించి జగన్‌కు వివరించారు. అంతకు ముందు రోజు.. మంగళవారం రాత్రే సీఎన్‌పీ నాగరాజు, ఇద్దరు కౌన్సిలర్లు, ఓ నాయకుడిని సస్పెండ్ చేశారు. దీంతో పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నవీన్ నిశ్చల్, వేణుగోపాలరెడ్డిపై చర్యలు తీసుకోకుండా, దళితులు, మైనార్టీలపై చర్యలు తీసుకోవడం ఏమిటని ఆ పార్టీ నాయకులు ప్రశ్నించారు. ఈ క్రమంలో దీపిక, వేణురెడ్డి జగన్‌ను కలిశాక నవీన్ నిశ్చల్, వేణుగోపాలరెడ్డిని బుధవారం రాత్రి సస్పెండ్ చేశారు.

వైసీపీలో కలకలం..

నవీన్ నిశ్చల్ 40 ఏళ్లుగా రాజకీయాలలో ఉన్నారు. ఎక్కువకాలం కాంగ్రెస్‌ను అంటిపెట్టుకున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా హిందూపురంలో బరిలోకి దిగారు. కాంగ్రెస్ అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు సంపాదించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో టిక్కెట్ ఆశించారు. కానీ ఆఖరి క్షణంలో రిటైర్డ్ పోలీస్ అధికారి షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు టిక్కెట్ ఇచ్చారు. అయినా వైసీపీలోనే ఉంటూ వచ్చిన ఆయనకు రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. వైసీపీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో ఆ పదవి దక్కిందని చెబుతారు.

పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఆరోపణలతో గతంలో పలుమార్లు సస్పెండ్ అవుతారనే ప్రచారం జరిగింది. కానీ ఎన్నడూ చర్యలు తీసుకోలేదు. అయితే ఇప్పుడు వేటు పడింది. దీపిక, వేణురెడ్డి పట్టుపట్టి అతన్ని సస్పెండ్ చేయించారని సమాచారం. నవీన్‌పై చర్యలతో దీపిక వర్గంలో ఎక్కడలేని ఉత్సాహం కనిపిస్తోంది. కొండూరు వేణుగోపాలరెడ్డి కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి కాంగ్రెస్‌లో ఉన్నారు. వైఎస్ కుటుంబంతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతుంటారు. వైసీపీ ఆవిర్భావ సమయంలో కాంగ్రెస్‌ను వీడి.. పార్టీలో చేరారు. హిందూపురం నియోజకవర్గానికి ఆయన వైసీపీ రెండో సమన్వయకర్త. ఆయనపైనా సస్పెన్షన్ వేటు పడింది.

సారోళ్లకు.. ప్రజలే సేవకులు..!

- ధ్రువపత్రాల జారీలో వీఆర్వోల నిర్లక్ష్యం
- సంతకాలతో సరిపెడుతున్న వైనం
- మిగతా ప్రక్రియ దరఖాస్తుదారులదే..
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రజల ప్రదక్షిణ



అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు

అనంతపురం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్వో)లు దర్పం ప్రదర్శిస్తున్నారు. తాము చేయాల్సిన పనులను సైతం ప్రజలతో చేయిస్తున్నారు. ధ్రువపత్రాల జారీలో ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్నారు. సంతకాలు చేసి, చేతులు దులుపుకుంటున్నారు. మిగతా ప్రక్రియ దరఖాస్తుదారులకే అప్పజెబుతున్నారు. దీంతో వారు రోజులపాటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రస్తుతం విద్యాసంస్థల్లో ప్రవేశాలకు వివిధ సర్టిఫికెట్లు అవసరమవుతున్నాయి. ఈక్రమంలో రోజువారీగా అనంతపురం అర్బన్, రూరల్ కార్యాలయాలకు వందల సంఖ్యలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. సర్టిఫికెట్లు సకాలంలో జారీ కాకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకే పనులు..

అర్బన్, రూరల్ కార్యాలయాల్లో కుల ధ్రువీకరణ, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ ఇతరత్రా సర్టిఫికెట్ల జారీకి తహసీల్దార్లు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సచివాలయాలు, మీసేవ సెంటర్లలో ధ్రువపత్రాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకుంటారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను వీఆర్వోలు డౌన్‌లోడ్ చేసుకుని, వాటికి చెక్‌లిస్టు తీసుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. ఆ తరువాత సంతకాలు చేసి పైస్థాయి అధికారులకు రెఫర్ చేయాల్సి ఉంది. తద్వారా అప్లికేషన్లను తహసీల్దార్ కార్యాలయంలోని రిజిస్టర్‌లో నమోదు చేసి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్‌తో సంతకాలు చేయించాలి. అనంతరం చెక్‌లిస్టును ఆన్‌లైన్‌లో స్కాన్ చేయించి కంప్యూటర్ ఆపరేటర్లతో అప్రూవల్ చేయించాల్సి ఉంది. ఈ పనులన్నీ వీఆర్వోలు చేయాలి. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా సాగుతోంది. దరఖాస్తుదారులే ఈ పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

సర్టిఫికెట్ల కోసం ప్రజలు సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న తరువాత వీఆర్వోల వద్దకు తీసుకెళ్తున్నారు. కొంతమంది వీఆర్వోలు సంతకాలు పెట్టి, దరఖాస్తుదారుల ద్వారానే వాటిని తహసీల్దార్ కార్యాలయాలకు పంపుతున్నారు. చెక్‌లిస్టులను కూడా దరఖాస్తుదారులతోనే తెప్పించుకుని సంతకాలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. మరి కొంతమంది దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగైదురోజులైనా ఆన్‌లైన్‌లోని సర్టిఫికెట్లను ఫార్వార్డ్ చేయని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో దరఖాస్తుదారులు అప్లికేషన్లను చేతబట్టుకుని తహసీల్దార్ కార్యాలయాల వద్దకు పరుగులు పెడుతున్నారు. అక్కడ ఆర్ఐ, తహసీల్దార్ సంతకాలు తప్పనిసరి. వారిలో ఎవరు లేకున్నా ధ్రువపత్రాలు మంజూరుకావు. సమయానికి అధికారులుంటే సరి.. లేదంటే.. మరో రోజు కార్యాలయానికి అప్లికేషన్ పట్టుకుని, వెళ్లాల్సి ఉంటుంది. ఈక్రమంలో సర్టిఫికెట్ల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందంటూ దరఖాస్తుదారులు వాపోతున్నారు. దీనిపై నిలదీస్తే సర్టిఫికేట్ల జారీకి వారం, నెల రోజులు సమయం ఉందని చెబుతూ ఆఫీసులు చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు.

అక్రమాలు నిజం.. రికవరీ చేయం..!

డ్వామా అధికారుల తీరుపై విమర్శలు

- ఉపాధి పనుల్లో అవినీతి నిగ్గుతేల్చారు
- ప్రజావేదికలోనే ప్రకటించారు..

సొమ్ము వసూలులో మాత్రం నిర్లక్ష్యం



అక్రమాలను డ్వామా పీడీ సలీం బాషాకు వివరిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు (ఫైల్)

కళ్యాణదుర్గం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను సాక్షాత్తు డ్వామా అధికారులే తేల్చారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలోనే ప్రకటించారు. పక్కదారి పట్టిన ప్రజాధనాన్ని రికవరీ మాత్రం చేయరు, శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోరు. ఎందుకో, ఏమో..? నెలలు గడుస్తున్నా.. ఆ ఊసే ఎత్తరు. ప్రజాధనమే కదా, పోనీలే అనుకున్నారో.. ఏమో.. డ్వామా ఉన్నతాధికారులే సెలవియ్యాలి. కంబదూరు మండలంలో వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వసతి గృహాల్లో పనిచేసే ఉద్యోగులను కూడా ఉపాధి కూలీలుగా చూపించి, ఉపాధి నిధులను ఎంచక్కా స్వాహా చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న కంబదూరులో నిర్వహించిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలోనే అధికారులు అవినీతిని బయట పెట్టారు. డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ సుధాకర్ రెడ్డి, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రజావేదికను అప్పట్లో నిర్వహించినా ఇంతవరకు రికవరీ అతీగతీ లేదన్న విమర్శలు లేకపోలేదు.

మొక్కల మాటున స్వాహా

కంబదూరు మండలంలో 2023-24 ఏడాదిలో ఉపాధి హామీ పనులకు రూ.6 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు రూ.2 కోట్లు ఖర్చు చేశారు. అందుల్లో అక్రమాలకు అంతేలేదన్న ఆరోపణలున్నాయి. సామాజిక తనిఖీ బృందం సభ్యులు కూడా తనిఖీలు చేపట్టారు. రూ.4.02 లక్షలు రికవరీ చేస్తున్నట్లు అధికారులు స్వయంగా ప్రకటించారు. నెలలు గడుస్తున్నా.. నేటికీ అతీగతీలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కంబదూరు మండలంలోని 12 పంచాయతీల్లో పనిచేసే కొంతమంది వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు... వసతి గృహాల్లో పనిచేసే ఉద్యోగులను ఉపాధి కూలీలుగా చూపించి, మస్టర్లలో పేర్లు రాసి నిధులను స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులే క్షేత్రస్థాయికి వెళ్లి గుర్తించారు. ఇలా రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలదాకా నిధులు దుర్వినియోగమైనట్లు బయటపడింది. పండ్ల మొక్కలు లేకున్నా, ఉన్నట్లుగా చూపించి నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. వైసీపీ హయాంలో రూ.2 కోట్లకు పైబడి ఖర్చు చేసి పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సీసీరోడ్లు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలల ప్రహరీల పనులు చేపట్టారు. ఇందులో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఈ పనుల వివరాలు వెల్లడించకుండా మౌనం వహిస్తున్నారు. పనులు అర్థాంతరంగా ఆగిపోయాయా, పూర్తయ్యాయా, నిధులు పక్కదారి పట్టాయా అన్న వివరాలేవీ నేటికీ బహిర్గతం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు వాటి గురించి చెప్పేవారే కరువయ్యారు. అసలు రికవరీ చేస్తారా, అటకెక్కిస్తారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పనుల్లో తేల్చిన అక్రమాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రికవరీకి ఆదేశిస్తాం

ఉపాధి హామీ రికార్డులను పరిశీలిస్తాం. పక్కదారి పట్టిన నిధుల రికవరీకి ఆదేశాలు జారీ చేస్తాం. - **సూర్యనారాయణ, ఎంపీడీఓ, కంబదూరు**

హంద్రీనీవా సిద్ధం

(5వ పేజీ తరువాయి)

కాలువలో పనుల అంతిమ పరిస్థితిని పరిశీలించారు. అత్యవసరంగా పూర్తి చేయాల్సిన పనులపై కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు.

లైనింగ్ పనులు నిలుస్తాయా..?

హంద్రీనీవా వెడల్పు పనుల్లో భాగంగా మట్టికట్టలు, డీప్‌కట్ పనులు పూర్తవుతాయని, లైనింగ్ పనులు ఈసారికి పెండింగేనని ఇంజనీర్లు తొలుత భావించారు. కానీ ఈ నెలలో హుటాహుటిన బండ్ లైనింగ్ పనులను చేపట్టారు. కొన్నిచోట్ల లైనింగ్ పనులు రికార్డు స్థాయిలో చేపట్టి పూర్తిచేశారు. గుంతకల్లు మండలంలోని జి.కొట్టాల గ్రామం వద్ద ఒక గట్టుకు లైనింగ్ చేపట్టగా, ఆ పనులు పూర్తయ్యే పరిస్థితులు లేవు. గురువారం పంపింగ్ ప్రారంభమైతే ఈ నెల 20 లేదా 21వ తేదీన కాలువలో కృష్ణానీరు జిల్లాలోకి ప్రవేశిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు లైనింగ్ పనులు మరో రెండు రోజులు మాత్రమే చేపట్టే వీలుంది. ఈ కొంచెం సమయంలో లైనింగ్ పనులు పూర్తికావు. లైనింగ్ కాంక్రీటుకు క్యూరింగ్ తగినంత సమయం లేనందున అతి వేగంగా పారే నీటికి సిమెంటు నిర్మాణం తట్టుకుంటుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బుగ్గసంగాల, కసాపురం గ్రామాల వద్ద ఉన్న మట్టికట్టలకు లైనింగ్ పనులను ప్రారంభించలేదు. చేపట్టిని లైనింగ్ వర్కులన్నీ వచ్చే సీజన్‌కు వాయిదాపడ్డాయి.



కసాపురం వద్ద పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ

పనులను పరిశీలించిన ఎస్ఈ

హంద్రీనీవా కాలువలో గురువారం ఎత్తిపోతలు ప్రారంభించడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో.. నీటి పారుదలకు సమస్య ఏర్పడకుండా చేపట్టాల్సిన పనులను ఎస్ఈ రాజాస్వరూప్ కుమార్, గుంతకల్లు ఏరియా ఈఈ శ్రీనివాస నాయక్ బుధవారం పరిశీలించారు. కాలువలో 134 కి.మీ. నుంచి 146 కి.మీ. వరకూ పనులను తనిఖీ చేశారు. ఈ నెల 20వ తేదీకల్లా జిల్లాలోకి సాగునీరు వచ్చే పరిస్థితులు ఉన్నందున బెడ్డింగ్ వర్కులన్నీ వెంటనే పూర్తిచేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటి పారుదలకు ఎలాంటి ఆటంకం లేకుండా వెడల్పు పనులన్నీ పూర్తి చేశామని తెలిపారు. లైనింగ్ వర్కులు మాత్రమే మిగిలి ఉన్నాయని, మిగిలిన పనులను వచ్చే సీజన్‌లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వెడల్పు పనులను సకాలంలో పూర్తి చేశామని అన్నారు. కాలువ గట్లపై జీప్ ట్రాక్ పనులను చేపట్టాల్సి ఉందని, నీరు వచ్చాక వాటిని పూర్తి చేస్తామని తెలిపారు.

రహదారిపై యువకుడి మృతదేహం

ఛిద్రమైన తల, మొండెం

రోడ్డు ప్రమాదమా..? చంపి పడేశారా..?

బుక్కరాయసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం-అమరావతి హైవేపై (544డి) గుర్తుతెలియని యువకుడు బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయకొట్టాల గ్రామ శివారులో రహదారిపై 25 నుంచి 30 ఏళ్లలోపు యువకుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువకుడి చేతిపై సినీ హీరో అల్లుఅర్జున్ ఐకాన్ ఏఏ టాటూ వేయించుకున్నాడని, మరో చేతిపై ఎస్ అనే అక్షరం ఉందని పోలీసులు తెలిపారు. అతడి మొండెం తెగిపోవడం, మొహం ఛిద్రం కావడంతో గుర్తుపట్టని విధంగా ఉన్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా? ఎవరైనా హత్య చేసి రోడ్డుపై పడేసి వెళ్లారా.. అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఆ సమయంలో నడిచి ఎందుకు వచ్చాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


చిగిచెర్ల నారాయణ(ఫైల్)

నార్పల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడ్డం నాగేపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణ(64) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నారాయణకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఐదేళ్ల నుంచి అరటి, మిరప సాగు చేస్తూ నష్టపోయాడు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ.8 లక్షలు, దానిపై వడ్డీ తీర్చలేకపోయారు. ఈ ఒత్తిడితో ఈ నెల 10న ఇంట్లో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కోలుకోలేక బుధవారం మృతిచెందారు. ఆయనకు భార్య సుశీలమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఒకే రోజు 10 ఇళ్లలో చోరీ


దొంగతనానికి ఉపయోగించిన కడ్డీ

పుట్టపర్తి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఒకే రోజు పది ఇళ్లలో చోరీలు జరిగాయి. బుధవారం తెల్లవారుజామున శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి స్టాఫ్ క్వార్టర్స్‌లో 10 ఇళ్లలో భారీఎత్తున నగదు, బంగారు నగలను అపహరించారు. రాత్రి విధులు ముగించుకుని ఉదయం ఇంటికి వచ్చిన సిబ్బంది తమ ఇళ్ల, బీరువాల తాళాలను దుండగులు పగులగొట్టినట్లు గుర్తించారు. తమ ఇళ్లలో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డ్యాగ్‌స్క్వాడ్‌తో అక్కడకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. దుండగులు చోరీకి పాల్పడిన ప్రాంతానికి సమీపంలో కలెక్టర్ బంగ్లా కూడా ఉండటం గమనార్హం. నిరంతరం సెక్యూరిటీ ఉండే ప్రాంతంలో భారీ చోరీ జరగడంతో పోలీసుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే తరహాలో గత ఏడాది పట్టణానికి సమీపంలోని సందీప్‌విల్లాలో కూడా రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన దుండగులు భారీగా బంగారు నగలు అపహరించుకుపోయారు. నేటికీ ఆ కేసును పోలీసులు ఛేదించలేకపోయారు. భారీ దొంగతనం జరగడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలని కోరుతున్నారు. ఈ ఘటనపై రూరల్ ఎస్సై లింగన్నను వివరణ కోరగా బంగారు నగలు, నగదు ఎంత చోరీ అయ్యిందో ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. చోరీ సమాచారంపై తాము ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి


సువర్ణమ్మ (ఫైల్)

ముదిగుబ్బ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధన్నగారిపల్లి లో పాముకాటుతో మహిళా రైతు సువర్ణమ్మ(44) బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ నాగభూషణం పేర్కొన్నారు. ఆయన తెలిపిన మేరకు సిద్ధన్నగారిపల్లికి చెందిన శివారెడ్డి భార్య సువర్ణమ్మ భర్తతో కలిసి చీనీ తోటలో కలుపు తీస్తుండగా చేతికి పాము కాటేసింది. వెంటనే ప్రైవేటు వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా ఆమె మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తమ్ముడూ..! అమ్మ జాగ్రత్త

● వీడియో కాల్ చేసి.. అన్న ఆత్మహత్య


రేవంత్‌కుమార్ (ఫైల్)

గుత్తి రూరల్/ పెబ్బేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ్ముడూ అమ్మ జాగ్రత్త... అంటూ ఒక అన్న వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో చోటుచేసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలను ఎస్సై గంగిరెడ్డి యుగేంధర్ రెడ్డి బుధవారం తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం పి కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణకు రేవంత్ కుమార్ (27), కిరణ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదేళ్ల కిందట తండ్రి మృతి చెందటంతో పెద్ద కుమారుడు రేవంత్ కుమార్ ఇంటి బాధ్యతలను చూసుకుంటున్నాడు. గుత్తి మార్కెట్ నుంచి తన బొలెరో వాహనంలో పచ్చిమిర్చిని తీసుకొని నిజామాబాద్‌కు బయలుదేరాడు. మంగళవారం సాయంత్రం వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ సమీపంలోని కొత్తకోట బైపాస్ జాతీయ రహదారిపై తన వాహనాన్ని నిలిపాడు. తన తమ్ముడు కిరణ్ కుమార్‌కు వీడియో కాల్ చేసి తను చేసిన అప్పుల వివరాలు నోట్‌బుక్‌లో ఉన్నాయని, భూమి అమ్మి అందరి అప్పులు చెల్లించాలని కోరాడు. ఇక నుంచి ఇంటి బాధ్యతతో పాటు అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని, తాను చనిపోతున్నానంటూ వీడియో కాల్‌లో మాట్లాడుతూ పురుగుల మందు తాగాడు. అన్న మొబైల్ లోకేషన్ పరిశీలించగా పెబ్బేరులో ఉన్నట్లు తెలిసింది. దీంతో సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఫుల్లు కిక్కు..!

భారీగా పెరిగిన మద్యం విక్రయాలు

తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో అమ్మకాలు

గతేడాది కంటే 92 శాతం అధికం

161.66 శాతం పెరిగిన బీర్ల విక్రయాలు

బ్రాండెడ్ అందుబాటులోకి రావడం, ధరలు తగ్గడమే కారణం



"వైసీపీ పాలనలో పెగ్గు వేయాలంటే మద్యంబాబులు బెంబేలెత్తేవారు. బూమ్.. బూమ్.. అంటూ రకరకాల అనామక పేర్లతో మద్యం సరఫరా చేసేవారు. ధరలు మాత్రం ఆకాశాన్ని తాకేవి. విధిలేని పరిస్థితుల్లో ఆ నాసిరకం మద్యం తాగిన ఎంతోమంది ఆస్పత్రులు పాలయ్యారు. వారిలో చాలామంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి మంచానికే పరిమితమయ్యారు. కొందరు చనిపోయారు కూడా. దీంతో ఆయా కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. బతికిన వారికి కూడా ఆస్పత్రుల ఖర్చులకు ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. వారు కూడా అన్నీ కోల్పోయి రోడ్డున పడ్డారు. దీంతో మందుబాబులు ఏపీ మద్యానికి భయపడి, పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చుకునేవారు. నాటుసారా విక్రయాలు కూడా విపరీతంగా సాగేవి. వెరసి.. ప్రభుత్వ మద్యం విక్రయాలు భారీగా పడిపోయాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక బ్రాండెడ్ మద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ధరలను సైతం తగ్గించింది. దీంతో మద్యం ప్రియులు పక్క రాష్ట్రాల వైపు చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. రూ.99కే ప్రీమియం క్వార్టర్ అందుబాటులోకి రావడంతో నాటుసారా విక్రయాలకు చెక్ పడింది. వెరసి.. ప్రభుత్వ మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగియి. కర్ణాటక సరిహద్దులోని కంబదూరు, కళ్యాణదుర్గం ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో జిల్లాలోనే అత్యధికంగా 2025-26 తొలి త్రైమాసికంలో బీర్ల విక్రయాలు సాగాయంటే కర్ణాటక మద్యానికి ఏ స్థాయిలో చెక్ పడిందో అర్థం చేసుకోవచ్చు. కాగా, మద్యం విక్రయాలు రికార్డు స్థాయిలో పెరిగినా.. ధరలు తగ్గించడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా పడిపోయింది."

అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెగ్గు మీద పెగ్గేయ్... అంటూ మద్యంప్రియులు ఫుల్లుగా తాగేశారు. 2025-26 తొలి త్రైమాసికంలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. గతేడాది త్రైమాసికం కంటే.. ఈసారి భారీగా పెరిగాయి. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఏకంగా 6.74 లక్షల కేసుల మద్యం అమ్ముడైంది. ఇందులో లిక్కర్ 4.24 లక్షలు, బీర్ 2.50 లక్షల కేసులు విక్రయించారు. రమారమి రూ.302 కోట్ల విలువైన మద్యం సేల్స్ జరిగాయి.

జిల్లాలో తొలి త్రైమాసికంలో మద్యం, బీర్ల విక్రయాలు ఇలా..

సర్కిల్	మద్యం విక్రయాలు	బీర్ విక్రయాలు	మొత్తం విక్రయాలు	విలువ
అనంతపురం	1,21,155	94,284	2,15,439	రూ.96.65 కోట్లు
గుత్తి	42,652	24,761	67,413	రూ.30.04 కోట్లు
గుంతకల్లు	40,331	19,826	60,157	రూ.27.66 కోట్లు
కళ్యాణదుర్గం	32,115	18,273	50,388	రూ.21.99 కోట్లు
కంబదూరు	12,672	6747	19419	రూ.8.29 కోట్లు
కణేకల్లు	18,943	7,587	26,530	రూ.12.43 కోట్లు
రాయదుర్గం	34582	14793	49375	రూ.22.16 కోట్లు
శింగనమల	40484	25905	66393	రూ.28.45 కోట్లు
తాడిపత్రి	52492	26985	79477	రూ.36.67 కోట్లు
ఉరవకొండ	28573	11066	39639	రూ.18.38 కోట్లు
మొత్తం	4,23,999	2,50,231	6,74,230	రూ.302.78 కోట్లు

తొలి త్రైమాసికంలో భారీగా...

అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, రాయదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెద్దఎత్తున లిక్కర్, బీర్ కేసులు విక్రయించారు. అనంతపురం ఎక్సైజ్ సర్కిల్ 2.15 లక్షల కేసులు అమ్ముడయ్యాయి. గతేడాది 3.51 లక్షల కేసుల మద్యం మాత్రమే విక్రయించారు. 2024 ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికంలో లిక్కర్ 2.55 లక్షల కేసులు, బీర్ 95,631 కేసులు అమ్ముడయ్యాయి. మొత్తంగా 3.51 లక్షల లిక్కర్, బీర్ కేసులు విక్రయించారు. తద్వారా రూ.226.47 కోట్ల విలువైన మద్యం వ్యాపారం సాగింది. గతేడాది కంటే ఈసారి తొలి త్రైమాసికంలో భారీగా అమ్మకాలు పెరిగాయి. గతేడాది కంటే లిక్కర్ 66.03 శాతం, బీర్ 161.66 శాతం విక్రయాలు పెరగడం గమనార్హం. మొత్తంగా ఈ ఏడాది 92.08 శాతం అధికంగా విక్రయాలు సాగాయి.

బీర్లు పొంగించారు....

ఈ ఏడాది బీర్లు ఉప్పొంగాయి. యువత, మధ్యవయసు వారు భారీగా బీర్ల కొనుగోలుకు ఉత్సాహం చూపారు. గతేడాది 95,631 కేసులు మాత్రమే అమ్ముడు పోగా.. ఈసారి ఏకంగా 2.55 లక్షల కేసులు దాటించారు. అత్యధికంగా కంబదూరు సర్కిల్‌లో బీర్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గతేడాది కేవలం 915 కేసులు అమ్ముడు కాగా.. ఈసారి ఏకంగా 6,747 విక్రయాలతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానంలో శింగనమల నిలిచింది. శింగనమల సర్కిల్‌లో 247.68 శాతం, కళ్యాణదుర్గం 226.54 శాతం అమ్మకాలు జరిగాయి. అనంతపురం కూడా బీర్ల అమ్మకాల్లో ఈ మూడు సర్కిళ్ల కంటే వెనుకబడటం గమనార్హం. గతేడాది కంటే ఈసారి బీర్ల అమ్మకాలు 161.66 శాతం పెరిగాయని చెప్పవచ్చు.

చరిత్రలో చిరస్థాయిగా చంద్రబాబు

నేడు హంద్రీనీవాకు నీటిని విడుదల చేయనున్న సీఎం

40 టీఎంసీలతో భవిష్యత్తుకు భరోసా

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయలసీమ ద్రోహి వైఎస్ జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు తేవడంతో సీఎం చంద్రబాబునాయుడు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఎం చేతుల మీదుగా మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్‌కు నీటి ఎత్తిపోతలను గురువారం ప్రారంభించనుండడం శుభపరిణామం అన్నారు. స్థానిక రాంనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి కాలవ మీడియా సమావేశం నిర్వహించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ ఆలోచన అన్నారు. దీని ఫలాలు, ఫలితాలు పూర్తిగా అనుభవించాలన్న తాపత్రయం సీఎం నారా చంద్రబాబునాయుడిదేనన్నారు. కాంగ్రెస్ హయాంలో కొంతమేర పనులు చేసినా.. విపరీతమైన అవినీతి, అక్రమాల కారణంగా ఫలాలు అందజేదన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక హంద్రీనీవా పథకంలో కొత్త శకం ప్రారంభమైందన్నారు. అప్పట్లోనే రూ.2,700 కోట్లు ఖర్చు చేశారన్నారు. సీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే... హెచ్ఎన్ఎస్ఎస్‌కు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి, ఒక దశకు తీసుకొచ్చారన్నారు. ఫలితంగా గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు రావడంతోపాటు కియ ఫ్యాక్టరీ ఏర్పాటైందన్నారు. 2019-24 మధ్యలో జగన్ వల్ల ఈ పథకం మళ్లీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఐదేళ్లు ప్రగతి ఊసే లేదన్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం అవడంతో హెచ్ఎన్ఎస్ఎస్ పనులు పరుగులు పెట్టించారన్నారు. కూటమి ఏడాది పాలనలోనే రూ.3 వేల కోట్ల పైచిలుకు నిధులతో కాలువ వెడల్పు, 2వ దశ పనులు చేపట్టారన్నారు. 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచడమే లక్ష్యంగా పనులు పూర్తి చేసింది చంద్రబాబునాయుడేనన్నారు. ఆయనే కాలువకు నీరు వదులుతుండడం ఆనందంగా ఉందన్నారు. అనంతపురం జిల్లా రైతుల పక్షాన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. 5 దశాబ్దాల కింద 40 టీఎంసీల నీరు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా తేవాలనుకుని ఎన్టీఆర్ కలలు కనగా... నేడు చంద్రబాబు నిజం చేయబోతుండటం ఆనందంగా ఉందన్నారు. 40 టీఎంసీలు ఈ ఏడాది తెచ్చుకోగలిగితే చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాయలసీమ బిడ్డగా, ఈ గడ్డ రుణం తీర్చుకున్న నాయకుడిగా చరిత్రలో నిలుస్తారన్నారు జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ... హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కృష్ణా జలాలు తేవడం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా 33 లక్షల మందికి తాగునీరు, 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గత ఐదేళ్లు జగన్ హెచ్ఎన్ఎస్ఎస్‌కు తీరని అన్యాయం చేశారన్నారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకుని, సీమకు తీరని ద్రోహం చేశారంటూ మండిపడ్డారు. సీఎం సంకల్పానికి ప్రకృతి సైతం సహకరిస్తోందన్నారు. శ్రీశైలం డ్యాం నిండుకుండలా ఉండటం, చంద్రబాబునాయుడు కాలువకు నీటిని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల మంజూరు వేగవంతం చేయాలి

ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ

అనంతపురం అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన రైతులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డ్రిప్, స్ప్రింకర్ల మంజూరును మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి ఆదేశించారు. ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో డ్రిప్ కంపెనీల డీసీఓలు, ఎంఐ ఇంజనీర్లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. గత ఆర్థిక సంవత్సరంలో పెండింగ్‌పడిన డ్రిప్ పరికరాల సరఫరా, తుది పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ఏడాదికి జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల పరికరాల మంజూరు లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ఇప్పటిదాకా 1,900 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారన్నారు. సకాలంలో పరికరాలు మంజూరు చేయడంతోపాటు సరఫరా అయ్యేలా చొరవ చూపాలని ఆదేశించారు.

చీనీ.. టన్ను రూ.15వేలు

అనంతపురంరూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1227 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (వయా గుత్తి) ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-తిరుపతి (నం. 07009) ప్రత్యేక వీక్లీ రైలు ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 28వ తేదీ వరకూ గురువారాల్లో సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి తిరుపతికి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఆగస్టు 1 నుంచి 29వ తేదీ వరకూ శుక్రవారాల్లో తిరుపతిలో సాయంత్రం 8.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఎనిమిదిన్నరకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

ఘనంగా కుళ్లాయిస్వామి జార్తాలు


అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

నార్పల, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ గూగూడు కుళ్లాయిస్వామి పది రోజుల జార్తాలు కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన పది రోజులకు అగ్ని గుండానికి గ్రామంలోని ముస్లింలు పూర్తి ఫాతేహాలు నిర్వహించారు. జార్తాలు సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా అండర్-16 మల్టీ డే క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-16 మల్టీ డే బాలుర క్రికెట్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. జట్టు వివరాలను స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ప్రకటించారు. కెప్టెన్‌గా అనంతపురానికి చెందిన ఆర్ సాత్విక్ వ్యవహరించనున్నార. సంజయ్‌కుమార్ (నార్పల), కౌశిక్ (అనంతపురం), అశీష్ (అనంతపురం), తన్మయి కార్తీక్ రెడ్డి (అనంతపురం), జెయిద్ (హిందూపురం), అభినవ్ సాత్విక్‌రెడ్డి (అనంతపురం), ఆదినారాయణ రెడ్డి (ఆత్మకూరు), కుషాల్ సాయి (అనంతపురం), దేవాన్ష్ (అనంతపురం), కిరణ్‌కుమార్ (అనంతపురం), లిఖిత్ (అనంతపురం), సంతోష్ (కదిరి), అఖిల్‌కుమార్ (గొట్లూరు), నీహార్ (అనంతపురం), కార్తీక్ (అనంతపురం) జట్టులో చోటు సంపాదించారు. మహ్మద్ షోయబ్ కోచ్‌గా నియమితుడయ్యారు. ఎంపికైన జట్టు గురువారం నుంచి కడపలో నిర్వహించే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-16 టోర్నీలో పాల్గొంటుందని భీమలింగారెడ్డి తెలిపారు.

ఆరేసిన ప్రమోద్

● నెల్లూరుపై అనంత గెలుపు ● కర్నూలు, కడప మ్యాచ్ డ్రా

మల్టీ డే క్రికెట్ టోర్నీ


రోహిత్‌రోషన్


కమ్మద్దీన్


ప్రమోద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16 (ఆంధ్రజ్యోతి): ప్రమోద్ కుమార్ ఆరు వికెట్లతో చెలరేగడంతో మల్టీ డే క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టుపై అనంత జట్టు విజయం సాధించింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు బుధవారం మూడోరోజు స్థానిక అనంత క్రీడాగ్రామంలో ముగిశాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు ఓవర్‌నైట్ స్కోరు 243/5తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 319 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్ ప్రమోద్‌కుమార్ 6 వికెట్లతో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు 44.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 315 పరుగులు సాధించింది. రోహిత్‌రోషన్ హాఫ్ సెంచరీ(46 బంతుల్లో 72)లో ఆకట్టుకున్నాడు. దీంతో అనంత జట్టు 4వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కర్నూలు, కడప మ్యాచ్ డ్రా

మరో గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప 105 ఓవర్లలో 459 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 74.1 ఓవర్లలో 268 పరుగులకు 7వికెట్లు కోల్పోయింది. కర్నూలు బ్యాటర్ కమ్మద్దీన్ సెంచరీ (111)తో జట్టును ఆదుకున్నాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


పెనుకొండలో ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం/పెనుకొండ రూరల్/రాయదుర్గం రూరల్/కణేకల్లు/బొమ్మనహాళ్, జూలై16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, పెనుకొండ, రాయదుర్గం పట్టణాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. కళ్యాణదుర్గంలోని శ్రీహనుమాన్, మధు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అధికారులు సాలురెడ్డి, నరేంద్ర భూపతి, బాలానాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏఓ శ్రావణ్ కుమార్ బృందంగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. రికార్డులకు, అక్కడున్న నిల్వలకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ రెండు దుకాణాల్లో నిల్వ ఉన్న 12.570 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపేశారు. అధికారుల తనిఖీల సమాచారంతో పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను నిర్వాహకులు మూసేసి, వెళ్లిపోయారు. రాయదుర్గంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేసి, రూ.2.60 లక్షల విలువ గల అనుమతులు లేని ఎరువులను గుర్తించి, వాటి విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కణేకల్లు, క్రాస్‌లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు. బొమ్మనహాళ్, మండలం ఉద్దేహాళ్‌లోని శ్రీ శారదాదేవి సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. పెనుకొండలోని ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివన్న, ఏఓ ప్రసాద్, చందన తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో రూ.13.27 లక్షల విలువచేసే 46 క్వింటాళ్ల విత్తనాల అమ్మకాలను నిలిపేశారు.

న్యూస్ బాక్స్

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలి

● 'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయాధికారులు

ఓబుళదేవరచెరువు, జూలై 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఎలా సాధించాలన్న అంశంపై వ్యవసాయశాఖ ఏడీ సనావుల్లా, ఏఓ ఇలియాజ్ అహమ్మద్ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిట్టపల్లిలో గ్రామసభ నిర్వహించారు. వేరుశనగ, పండ్లతోటల సాగు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించారు. అనంతరం మండల వ్యవసాయ కార్యాలయంలో అమడగూరు, ఓడీచెరువు రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కౌలు రైతులను గుర్తించి, రెవెన్యూ శాఖద్వారా గుర్తింపుకార్డులు ఇప్పించాలని సూచించారు. అలాగే భూసార పరీక్షలు చేసి, త్వరగా ఫలితాలు ఇచ్చేలా చూడాలని సూచించారు.

● తాడిమర్రి: మండలంలోని మరువపల్లి, అగ్రహారం గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఖరీఫ్‌లో సాగైన వేరుశనగపంటను ఏఓ శేఖర్‌నాయక్ తదితరులు పరిశీలించా రు. పంటకు సోకే చీడపీడలు, వాటి నివారణ చర్యలను వివరించారు. పట్టు పరిశ్రమశాఖ మండల అధికారి వేణుగోపాల్‌నాయక్, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● తనకల్లు : మండలపరిధిలోని చీకటిమానుపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేరుశనగలో ఎరువుల యజమాన్యం, విత్తన శుద్ధి, పిచికారి మందులు తదితర వివరాలను వివరించారు. రైతులు క్రిష్టారెడ్డి, ఎంపీఈఓ క్రిష్ణవేణి, జనజాగృతి వ్యవసాయాధికారి సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

● గాండ్లపెంట: ఖరీఫ్ పంటల సాగుపై బుధవారం మండలంలోని మల్లమీదపల్లి రైతు సేవా కేంద్రంలో ఏఓ షాదాబ్ రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో వేరుశనగను ఈ నెలాఖరి వరకు విత్తుకోవచ్చన్నారు. అంతర్ పంటలుగా కందులు, పొలం చుట్టూ మేర సాలు సాగుచేయాలని సూచించారు. ఏఈ ఓ భరణి, టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

'పక్కా గృహాలు మంజూరు చేయాలి'

నంబులపూలకుంట, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నిరుపేదలకు పక్కాగృహాలు మంజూరు చేయాలని వామపక్ష నాయకులు బుధవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందించారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్ల మంజూరుచేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏడాది యేడాది అవుతున్నా, ఒక్క నిరుపేదకు కూడా పట్టాకానీ, పక్కా గృహంకానీ మంజూరుచేయలేదన్నారు. వామపక్ష నాయకులు గంగిరెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, ఓబులేసు, బాలాజీ, దర్బార్‌రెడ్డి, గుర్రప్ప, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఏర్పాటు

తనకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో సీపీఎం ఆధ్వర్యంలో కూలీలు వేసుకున్న గుడిసెల వద్ద బుధవారం రైతు సంఘం మహాసభను ఆ సంఘం జిల్లా కార్యదర్శి జంగా లపల్లి పెద్దన్న, జిల్లా అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతు సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల కార్యదర్శిగా ప్రభాకర్‌నాయక్, అధ్యక్షుడిగా నాగేంద్రనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 20మంది సభ్యుల ఎన్నుకున్నారు. రైతు సంఘం సభ్యులు వీవీ రమణ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌వీ రమణ, సీపీఎం మండల కార్యదర్శి శివన్న, సీఐటీయూ కార్యదర్శి ఒంటెద్దు వేమన్న తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న శక్తి టీం, విద్యార్థినులు

పుట్టపర్తి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలు, శక్తియాప్‌పై అవగాహన కల్గి ఉండాలని మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ సూచించారు. ఈ మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన జనసంచార ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశా లలో అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను తెలియచేశారు. అత్యవసర పరిస్థితుల్లో 799348511 నంబరుకు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందవచ్చని డీఎస్పీ తెలియజేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ధర్మవరం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి ముస్తఫా బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ఉన్న కోరమండల్ ఇంటర్నేషనల్ ఎరువుల దుకాణంలో ఉన్న అను మతులు లేని రూ.1, 54, 354 లక్షల విలువైన 142బస్తాల ఎరువుల అమ్మకాలు నిలిపి వేసినట్లు ఏఓ తెలిపారు. ప్రతి రైతుకు ఎరువులు, మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే విక్రయించాలని దుకాణాల యజమానులకు ఏఓ సూచించారు.

హత్యాయత్నం కేసు నమోదు

గాండ్లపెంట, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మల్లమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లిలో ఓ వృద్ధురాలిపై జరిగిన దాడికి సంబంధించి హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా బుధవారం తెలిపారు. బనాన్‌చెరువుపల్లికి చెందిన వృద్ధురాలు సరస్వతిపై ఈ నెల 12న గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారన్నారు. ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో కదిరి ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించామన్నారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఆమె అల్లుడు నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఉట్లమాను ఉత్సవం


ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

ధర్మవరం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో ఉట్లమాను ఉత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా పీర్ల పండుగ ముగిసిన తర్వాత మూడు రోజులకు ఈ ఉట్లమాను ఉత్సవాన్ని పీర్లచావిడి ఎదురుగా నిర్వహించారు. ముందుగా పీర్ల మకాన్‌లో ఉన్న మౌలాలిస్వామికి చక్కెర చదివింపులు చేసి గజమాలలతో అలంకరించారు. అనంతరం గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు ఉత్సాహంగా ఉట్లమాను ఎక్కి సంబరం చేసుకున్నారు. అనంతరం టెంకాయ కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థులంతా తరలివచ్చారు. అనంతరం మౌలాలిస్వామి పీరును ఈడిగ కులస్తులు ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు క్రిష్టారెడ్డి, పెద్దిరెడ్డిగారి శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బప్పగారి ఓబిరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆ కార్యాలయంలో ఇన్‌చార్జ్‌లే..!

● పరిష్కారం కాని సమస్యలు

● రెగ్యులర్ అధికారులను నియమించాలంటున్న ప్రజలు


గాండ్లపెంట తహసీల్దార్ కార్యాలయం

గాండ్లపెంట, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కీలక పదవులన్నీ ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగిస్తున్నారు. అలా గే ఆర్ఐ, సర్వేయర్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో పలు సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. వివిధ రెవెన్యూ సమస్యలపై కార్యాలయానికి వస్తే రెగ్యులర్ అధికారులు లేకపోవడం, ఇన్‌చార్జ్‌లు ఉండడంతో పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నామని రైతులు అంటున్నారు. కార్యాలయంలో కీలకమైన తహసీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. అలాగే నెల క్రితం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ, సర్వేయర్ బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇతరులను నియమించినా, ఇంత వరకు బాధ్యతలు చేపట్టలేదు. ఇక పోతే గాండ్లపెంట రెగ్యులర్ సీఎస్‌డీటీ ఎన్పీకుంట మండలానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆర్ఐ లేకపోవ డంతో సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. ఏఎస్ఓ గాండ్లపెంటకు రెగ్యులర్ కాగా, అమడగూరుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కీలకమైన శాఖలకు ఇన్‌చార్జ్‌లు ఉండడం తో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు, రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించి, ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

● అధికారుల సమావేశంలో పరిటాల శ్రీరామ్


అధికారులతో సమావేశమైన పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన పేదలకు, చేనేతలకు ఇంటిస్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత మనదేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన బుధవారం రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. హౌసింగ్ డీఈ శంకర్‌లాల్, ఏఈ చిరంజీవి, మున్సిపల్ ఆర్ఐ శివకుమార్, టీపీఓలు అలివేలమ్మ, విజయభాస్కర్, టిడ్కో ప్రతినిధి తిరుమణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేశ్, వీఆర్వో రవిశేఖర్‌రెడ్డి, మండల సర్వేయర్లు పాల్గొన్నారు. ప్రధానంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ చేపట్టిన పాదయాత్రలో, 15 రోజులుగా తాను నిర్వహిస్తున్న సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులపై ఆయన చర్చించారు. చాలా మంది ఇళ్ల పట్టాలు లేవని, ఇళ్ల మంజూరు చేయాలని వచ్చిన వినతులే ఎక్కువగా వచ్చాయని అధికారులతో అన్నారు. వీటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్ల వల్ల ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలను రద్దు చేయడం, కొత్తగా ఇచ్చిన వాటికి స్థలాలు చూపకపోవడం, పేదల ఇళ్ల స్థలాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం వంటివి ఎన్నో ఉన్నాయని అన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. బేస్‌లెవల్ వరకు పూర్తి అయిన ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి అర్హత ఉన్న వారి జాబితాలను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో అధికారులతో పాటు టీడీపీపట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.

నీటి సరఫరా కార్మికుల సమ్మెకు సీపీఐ మద్దతు

ముదిగుబ్బ, జూలై 16(ఆంధ్రజ్యోతి): బకాయి పడ్డ పది నెలల జీతాలు వెంటనే చెల్లించాలని లవారం రోజులుగా విధులు బహిష్కరించి ముదిగుబ్బలోని పంప్ హౌస్ వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ కార్మి కులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. వారికి మద్దతుగా బుధవారం సీపీఐ నాయకులు సమ్మెలో పాల్గొని కార్మికులతో కలిసి పంప్‌హౌస్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులకు రావ లసిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

గంగమ్మ గుడిలో చోరీ

తనకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లిలో ఉన్న గంగమ్మ గుడిలో చోరీ జరిగింది. మంగళరాత్రి దుండగులు గుడి తాళాలు పగులకొట్టి, లోపలికి వెళ్లారు. హుండీ బీగాలు తీసి అందులోని నగదు తీసుకెళ్లారు. అయితే నాణ్యాలను అక్కడే వదిలేసి, నోట్లును మాత్రమే తీసుకెళ్లారు. బుధవారం ఉదయం గుడివద్దకు వెళ్లిన ధర్మకర్తలు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. హుండీలో దాదాపు రూ. ఐదువేలు నగదు ఉంటుందని ఆలయ ధర్మకర్తలు, గ్రామస్థులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రైతు సంఘాల అభివృద్ధే నాబార్డు ధ్యేయం: ఏజీఎం

తనకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతుసంఘాల అభివృద్ధే నాబార్డు ధ్యేయమని నాబార్డు జిల్లా అసి స్టెంట్ జనరల్ మేనేజర్ అనూరాధ పేర్కొన్నారు. ఆమె బుధవారం మండలంలోని చెక్కవారిపల్లిలో తమలపాకు రైతుల సంఘం పని తీరును పరిశీలించారు. గ్రామంలో ని ఆకుతోటల వద్దకు వెళ్లి రైతుల తో కలిసి వాటి వివ రాలు తెలుసుకున్నారు. రైతులకు సూచనలు ఇచ్చారు. రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జనజా గృతి ఈడీ రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లోలచెరువు సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి



కదిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లోలచెరువు సహకారం సంఘం అధ్యక్షుడిగా నాగూరి శ్రీనివాసరెడ్డిని నియమించినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు అందించారు. అలాగే సభ్యులుగా బి. రమేష్‌నాయక్, ఆనంద్‌ను నియమించారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పథకాలు అందకుంటే తెలపండి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


సాయినగర్ క్రాస్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కొత్తచెరువు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం మండలంలోని బైరాపురం పంచాయతీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలనువివరిస్తూ కరపత్రాలను అందించారు. వృద్ధులతో, వికలాంగులతో మాట్లాడతూ ప్రతి నెలా ఒకటో తేదీన మీకు పింఛన్ అందుతోందా? ఎవరైనా మిమ్మలను డబ్బులు అడుగుతున్నారా? మీకు డబ్బులు ఎంతిస్తున్నారు? అంటూ ఆరాతీశారు. అర్హులై ఉండి పథకాలు రాకుంటే తమ దృష్టికి తీసుకువస్తే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ ఇళ్లపై నుంచి 33 కేవీ విద్యుత్‌లైన్ వెళ్తోందని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, లైన్ మార్చాలని సాయినగర్ క్రాస్‌లో ప్రజలు ఎమ్మెల్యేని కోరారు. దీంతో ఆమె ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ లైన్ మార్చాలని సూచించారు. అదేవిధంగా సీసీరోడ్లు, లేవని దీంతో వర్షం వచ్చినప్పుడల్లా రోడ్లపై నీరు నిల్వ ఉంటోందని స్థానికులు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే ఆ రోడ్డును పరిశీలించారు. రోడ్లపై మురుగునీరు లేకుండా చూసే బాధ్యత లేదా ఇలా ఉంటే రోగాలు రావాఅని పంచాయతీ అధికారులపై మండిపడ్డారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు మిట్టపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

● ఓబుళదేవరచెరువు: మండలపరిధిలోని మిట్టపల్లి పంచాయతీలో గురువారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి తెలిపారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా ఎమ్మెల్యే బీసీకాలనీ, వనుకువారిపల్లిలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అన్నిశాఖల ధికారులు హాజరుకావాలని కోరారు.

స్మృతివనానికి భూమి కేటాయింపుపై హర్షం

బుక్కపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర రాజధాని అమరావతిలో పొట్టిశ్రీరాముల స్మృతి వనానికి భూమి కేటాయించడంపై ఆర్యవైశ్య సంఘం స్థానిక నాయకులు బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్యవైశ్యులను గుర్తించి స్థలం కేటాయించడంపై ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ కార్యదర్శి పోలేపల్లి ప్రశాంత్ కుమార్ తదితరులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిన ముప్పు


ప్రధాన రహదారిలో కూలిన భవనం.. ద్విచక్ర వాహనాలపై పడిన పైకప్పు

పుట్టపర్తి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. ఆ రహదారిలో నూతన భవననిర్మాణంలో భాగంగా పట్టణంలోని సత్యసాయి జనరల్ హాస్పిటల్ ఎదురుగా ఓ ప్రైవేట్ పాతభవనం కూలగొడుతున్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా ఆ భవనం పైకప్పు ప్రధాన రహదారిలోకి కూలిపోయింది, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. మామూలుగా ఆస్పత్రికి వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు ఆటోలు, బస్సుల కోసం అక్కడ వేచిచూసేవారు. నిరంతరం రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో బుధవారం ఉదయం పైకప్పు కూలే సమయంలోనే ఎవరూ లేకపోవడం గమనార్హం. అయితే అక్కడ నిలిపిఉన్న ద్విచక్రవాహనాలు తుక్కుతుక్కుగా మారిపోయాయి. భవనం కూలగొట్టే సమయంలో సంబంధిత వ్యక్తులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మధ్యవర్తిత్వ చట్ట ఫలాలు ప్రజలకు చేరాలి

● న్యాయాధికారుల సూచన

ధర్మవరం/కదిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, సమాజ శ్రేయస్సు కోసం సేవ చేయాలని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి నందిని.. న్యాయవాదులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వ ర్యంలో జిల్లా కోర్టు న్యాయాధికారి భీమరావు ఆదేశాల మేరకు 'మధ్యవర్తిత్వం దేశం కోసం' అనే కార్యక్రమం 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా న్యాయాధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది బుధవారం ధర్మవరంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి, మరో న్యాయాధికారి పీ లోకనాథంతో కలసి మధ్యవర్తిత్వ చట్టంపై కదిరి పట్టణంలో చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ... మధ్యవర్తిత్వం ప్రయోజనాలను వివరించారు. నూతనంగా అమలు జరుగుతున్న మధ్యవర్తిత్వ చట్ట ఫలాలను ప్రజల వద్దకు చేర్చి చైతన్య పరచాలని ఉద్యోగులు, ప్రజా సంఘాలకు సూచించారు.


ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు



కదిరిలో ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారులు, న్యాయవాదులు

ఘనంగా పోతులయ్య, వీరదిమ్మమ్మ ఉత్సవాలు


స్వామి, అమ్మవార్ల ప్రభలను ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిక్కస్వామి నగర్‌లో కొలువైన పోతులయ్య స్వామి, వీర దిమ్మమ్మ ఆలయం 25వ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పోతులయ్యస్వామి పూజారి మాదన చితంబరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పోతులయ్యస్వామి, వీరదిమ్మమ్మ, ధర్మవరం పాలేటి గంగమ్మ, గొట్లూరు లక్కవమ్మ, గుట్టకిందపల్లి పెద్దమ్మ, నల్లలమ్మ, ఆర్‌కొత్తపల్లి ముత్యాలమ్మ, గంగనపల్లి ఆదిశక్తి, రాజేంద్రనగర్ చౌడేశ్వరి, తాడిపత్రి చౌడమ్మ దేవతల ప్రభలు ఉత్సవాలకు తరలివచ్చాయి. ఆ ప్రభలను పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సుపరిపాలనలో తొలిఅడుగులో

ధర్మవరానికి మొదటి స్థానం

ధర్మవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కా ర్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గం జిల్లాలో మొదటి స్థానంలో నిలి చిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ తెలిపారు. పార్టీ శ్రేణులు, బూత్‌కన్వీనర్, కో కన్వీనర్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పిలుపు మేరకు ముందుకు తీసు కెళ్లారని అన్నారు. జిల్లాలో మొదటి స్థానంలో నిలబడటంతో పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులను అభినందించారు. ఇదే కృషితో ప్రభుత్వం అప్పగించిన కార్యక్రమాలను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు.

'సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి'


ప్రియాంకనగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ మిత్తిగొల్ల నాగమణి, టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణం లోని ప్రియాంకనగర్, మండలంలోని రేగాటిపల్లిలో బుధవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటిఇంటికివెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు చీమల రామాంజి, క్లస్టర్ రామాంజి, సురేశ్, రేగాటిపల్లి టీడీపీ నాయకులు వరదరాజులు, మారుతి, అశోక్ పాల్గొన్నారు.



● ముదిగుబ్బ: టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని 61వ బూత్ పర్యటించారు. టీడీపీ నాయకులు ఉత్తమ నాయుడు, రంగనాయకులు, గురుప్రసాద్, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



● గాండ్లపెంట : మండలకేంద్రంలోని 163వ బూత్ పరిధిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లు ప్రసాద్, రవీంద్రారెడ్డి, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



● నల్లమాడ: మండలంలోని దొన్నికోటలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ కేశవ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకకులు వెంకటరమణ నాయుడు, గంగులప్పనాయుడు, పెద్దప్పయ్యనాయుడు, ఆంజనేయుల నాయుడు, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



● ఓబుళదేవరచెరువు: మండలంలోని పగడాలవారిపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షుడు బోయపల్లి శివారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆర్ఎంపీ క్రిష్ణమూర్తి, బీసీ సెల్ సుధాకర్, క్షేత్రసహాయకులు రమణ, పలక గంగన్న, డీలర్ శివనారాయణ, బి. వెంకటస్వామి, సోమశేఖర్ పాల్గొన్నారు.

రస్తా సమస్యను పరిష్కరించాలని వినతి

ముదిగుబ్బ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో తమ పొలాలకు వెళ్ళే రస్తా సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ రైతులు బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వ్యవసాయ పనుల్లో భాగంగా రెతులు ఎదుర్కొంటున్న రస్తా సమస్యను తక్షణమే పరిష్కరిం చాలని వినతిలో పేర్కొన్నారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, మర్తాడు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

నల్లచెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి అలేఖ్య తెలిపారు. ఆమె బుధవారం స్థానిక కేజీబీవీని సిబ్బందితో కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. పాఠశాల ఏఓ శిరీష, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

వైభవంగా ముత్తరాయస్వామి ఉత్సవాలు



ముత్తరాయస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

అగళి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాయత్రి కాలనీలో బుధవారం ముత్తరాయస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. ముత్తరాయస్వామిని పురవీధులగుండా ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి, జడ్పీటీసీ ఉమేష్ హాజరయ్యారు. ముత్తరాయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాసభలను విజయవంతం చేయండి

చిలమత్తూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): కదిరిలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు ప్రవీణ్, సిద్దారెడ్డి, వెంకటేశులు, రామచంద్ర, సుధాకర్, నాగరాజు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చ జరిపి భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం మహాసభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.

'సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పాలి'

గోరంట్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలోనే పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలపట్ల అవగాహన కల్పించాలని విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి వేదవ్యాస్ సూచించారు. బుధవారం మండలంలోని గుమ్మయ్యగారిపల్లి శ్రీమారెమ్మ ఆలయంలో ఏకల్‌అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోరంట్ల, కదిరి, తలుపుల, ముదిగుబ్బ, బుక్కపట్నం ప్రాంతాలకు చెందిన ఏకల్ అభియాన్ మాతాజీ, ఆచార్యాలు శిక్షణలో పాల్గొన్నారు. సనాతన ధర్మ గురించి ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామవికాస్ దేవరాజుస్వామి, ఏకల్‌అంచల్ అభియాన్ ప్రసాద్, మూల్యాంకన్ రామాంజనేయులు, ఆర్‌ఎస్‌ఎస్ ధర్మప్రచార హరినాథ్‌రెడ్డి, అంచల్ అధ్యక్షులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులపై అవగాహన

పెనుకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి తరువాత విద్యార్థులు ఉన్నత చదువులకు సంబంధించి ఏవిధంగా ప్లాన్ చేసుకోవాలన్న అంశంపై బుధవారం లైఫ్ అట్ ఏపీఎస్ 21 సెంచరీ కాలేజ్, శంషాబాద్ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ సీబీఎస్ఈ పాఠశాలలో కళాశాల ప్రతినిధులు భవానీశంకర్, విశ్వనాథ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీసీ, బీపైసీ ద్వారా కేవలం ఇంజనీరింగ్‌మెడికల్ కోర్సులేకాకుండా చాలా కాంపిటేటివ్ పరీక్షలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఏ కోర్సులు చేయాలనే అంశంపై వివరించారు. మానసిక ఒత్తిడి తగ్గించుకుని పరీక్షల ద్వారా ఉజ్వలభవిష్యత్తును పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి: డీఎల్‌పీఓ

పరిగి, జూలై 16(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కల్పనకు పంచాయతీ కార్యదర్శులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ సమత సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా, మురుగు కాలువలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. మసీదు పక్కన కొన్ని నెలలుగా చెత్తను తీయలేదని స్థానికులు డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి సంజప్పను పిలిచి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగుల సందడి

సోమందేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులతో సందడి నెలకొంది. మండలంలోని 14సచివాలయాల్లో రిలీవ్ అవుతున్న సిబ్బంది, సంతకాల కోసం కార్యాలయానికి వచ్చారు. వారు బదిలీ అయిన ప్రదేశాలకు వెళ్లేందుకు ఎంపీడీఓ సంతకం కోసం క్యూకట్టారు. అయితే ఉద్యోగుల బదిలీల కారణంగా సచివాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. వివిధ అవసరాలతో వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఆర్డీటీ కోసం పోస్టుకార్డు ఉద్యమం

గోరంట్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీని పరిరక్షించేందుకు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్లు అభిమాన సంఘం నాయకులు సుదర్శన్‌నాయుడు, నటరాజ్, చంద్రమోహన్ తెలిపారు. బుధవారం విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని మంజూరు చేయాలంటూ కేంద్రానికి లేఖలు రాసిన కార్డులను పోస్టు చేశారు.

పెనుకొండలో మోస్తరు వర్షం



పెనుకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ఆకాశం మేఘావృతమై వర్షం కురవకపోవడంతో వేడిమిని తట్టుకోలేక తల్లడిల్లుతున్న ప్రజలకు బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేయడానికి ఈ వర్షం కొంతమేర అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

సోమందేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో టింబక్టివ్ కలెక్టివ్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవాసదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షులు ముంతాజ్ మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కవిత, మహిళాశక్తి సీఈఓ రమీజ, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండిరెడ్డిపల్లికి చెందిన వివాహిత నాగమ్మ బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తరచూ తలనొప్పి తీవ్రంగా వస్తుండడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యంకోసం 108లో హిందూపురం తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనుకొండ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పేదలకు అందించే రేషన్ బియ్యం కర్ణాటకకు తరలిస్తుండగా కియ పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు ధర్మవరానికి చెందిన డ్రైవర్ ముత్యాలప్ప, క్లీనర్ సోము బొలేరో వాహనంలో 60 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. గుట్టూరు వైజంక్షన్ వద్దకు రాగానే పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి బియ్యం స్వాధీనం చేసుకుని ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు.

కర్ణాటకకు సబ్సిడీ వేరుశనగ

- రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న దళారులు
- బస్తాపై రూ.420 లాభం
- రూ.100 ముట్టచెబుతున్న వైనం
- చోద్యంచూస్తున్న అధికారులు



మడకశిరకు వచ్చిన విత్తన వేరుశనగ కాయలు (ఫైల్)

మడకశిర రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ వేరుశనగ కర్ణాటకకు తరలుతోంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగను అందిస్తోంది. అయితే వర్షాలు లేక, వ్యవసాయానికి పెట్టుబడులు లేకపోవడంతో నిరాశతో ఉన్న రైతులకు దళారులు ఆశచూపి సబ్సిడీ వేరుశనగ విత్తనాన్ని కొనుగోలు చేస్తున్నారు. అధిక ధరలతో కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో మడకశిర, రొళ్ల, అగిళి, అమరాపురం, గుడిబండ మండలాల్లో 55 వేల ఎకరాల వరకు వేరుశనగ సాగు భూములున్నాయి. 37, 500 మంది రైతులు ఉన్నారు. ఇప్పటి వరకు 14, 600 మంది రైతులకు 11, 200 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీచేశారు. రైతు సేవా కేంద్రాల్లో విత్తన వేరుశనగను అందించారు. బస్తా వేరుశనగ రూ.1680లుగాఉంది. ఒక్కొక్కరైతుకు మూడు బస్తాలు అందిస్తున్నారు. కర్ణాటకలో బస్తా విత్తన వేరుశన రూ.2100లు ధర పలుకుతోంది. బస్తా వేరుశనగకు దళారులకు రూ.420 మిగులుతోంది. మూడు బస్తాలకు రూ.1260 లాభం వస్తోంది. దీంతో దళారులు రైతులను రైతు సేవా కేంద్రాలకు తీసుకువెళ్లి బయోమెట్రిక్ వేయించి మూడు బస్తాలకు రూ.300 వారికి ఇచ్చి విత్తన వేరుశనగను కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో వర్షం వచ్చినా రైతులు విత్తన వేరుశనగ వేయలేని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని అగళి మండలానికి చెందిన పలువురు రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఏయే రైతులు దళారుల నుంచి సబ్సిడీ వేరుశనగను తీసుకున్నారనే విషయంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని ఇన్‌చార్జి వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్‌ను అడగ్గా తన దృష్టికి రాలేదని, వస్తే చర్యలు తీసుకుంటానన్నారు.

సౌరశక్తిలో మహిళలదే కీలకపాత్ర

మోడల్ గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహం

కాలుష్య రహిత మోడల్ గ్రామాలకు అడుగులు

అవగాహన సదస్సులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని



బ్రోచర్ విడుదల చేస్తున్న మంత్రి అనగాని

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సౌరశక్తిలో మహిళలు కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర రెవెన్యూ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం లేపాక్షి రోడ్డులోని జేవీఎస్ ప్యాలెస్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన సబ్సిడీ పథకంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు కలెక్టర్ టీఎస్ చేతన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో మహిళల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. కోటి ఇళ్లమీద రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ గ్రామంలో అయితే వేగంగా అన్ని ఇళ్లమీద రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే ఆ గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహం కింద అందజేస్తామన్నారు. ఆ నిధులతో ఆ గ్రామం మోడల్ విలేజ్‌గా మారుతుందని వివరించారు. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెంపొందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందన్నారు. సోలార్ ఏర్పాటువల్ల విద్యుత్ బిల్లు తగ్గుతుందన్నారు. 3కేవీ సోలార్ ఏర్పాటుచేసుకుంటే రూ.2.10లక్షలు ఖర్చవుతుందన్నారు. ఇందులో పొదుపుసంఘాల నుంచి రూ.1.12లక్షలు బ్యాంక్ రుణాన్ని అందిస్తుందన్నారు. సబ్సిడీ రూ.70వేలు వస్తుందన్నారు. రాష్ట్ర వాటాకింద మరో రూ.20వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. లబ్దిదారుడు కేవలం రూ.20వేలు మాత్రమే సౌరవిద్యుత్‌కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే పీఏలు సురేంద్ర, వీరయ్య, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, నాయకులు ఆనంద్, మంగేష్, నాగరాజు, మంజునాథ్, పవన్, వెంకటేశ్, రాము పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరాళ్లపల్లిలో బుధవారం జరిగిన సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు హిందూపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బాగేపల్లి టోల్‌గేటు వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, హిందూపురం నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, నాయకులు మంగేష్, పవన్ తదితరులు మంత్రికి స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి



పీర్లను జలధికి తరలిస్తున్న భక్తులు

మడకశిర రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పీర్ల జలధి ఉత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తులు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జలధి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



మెళవాయిలో వివరాలు తెలుసుకుంటున్న కేంద్రబృందం సభ్యులు

మడకశిర రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మెళవాయి పంచాయతీ కేంద్రంలో బుధవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. రామాంజనేయులు, శ్రీనివాసులు పంచాయతీలోని జక్కేపల్లి, యూ రంగాపురం గుడ్డంపల్లి, మెళవాయి గ్రామాల్లోని పాఠశాలలో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, భోజనం పథకం, అంగన్‌వాడీ సేవలు తదితర వాటిని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడారు.

ట్రిపుల్ ఐటీకి గుట్టూరు విద్యార్థినుల ఎంపిక



ఉషశ్రీ | మౌనశ్రీ | జాహ్నవి

పెనుకొండ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు జడ్పీహైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు తెలిపారు. ఈ గుట్టూరు జడ్పీహెచ్ఎస్‌లో మార్చి 2025న 10వ తరగతి పరీక్షల్లో ఉషశ్రీ 577, మౌనశ్రీ 569, జాహ్నవి రాయల్ 569 మార్కులు సాధించారు. వీరు ఐఐఐటీకి ఎంపిక కావడంతో బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వీరిని అభినందించారు.

కర్ణాటక సీఎం సభకు ఆహ్వానం

పావగడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఈనెల 21న పావగడకు వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్పను తమకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్, సహకార మంత్రి కెఎన్ రాజన్న తదితరులు సోమవారం పట్టణంలోని మహాత్మగాంధీ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పథకాలకు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రెజ్లింగ్‌లో సత్తాచాటిన పురం విద్యార్థులు

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన ఐదవ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్, రేజ్లింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో హిందూపురం విద్యార్థులు సత్తాచాటారు. అండర్-11లో తిషాల్‌దత్త బంగారుపతకం, సాయిగగన కాంస్యపతకం, అండర్-13లో హితేష్‌దత్త బంగారు పతకం సాధించినట్లు కోచ్‌లు రమేష్, చరణ్‌రాజ్ తెలిపారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అవసరం

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ



ర్యాలీలో పాల్గొన్న అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో దీర్ఘకాలికంగా ఉన్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. బుధవారం న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ మాట్లాడుతూ కేసులు పరిష్కరించడంలో మధ్యవర్తిత్వం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా చెక్‌బౌన్స్, భరణం కేసుల్లో మధ్యవర్తుల ద్వారా పరిష్కారం త్వరగా అవుతుందన్నారు. ఆ దిశగా న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. దీనివల్ల కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్‌సివిల్‌న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, న్యాయవాదులు రాజశేఖర్, సిద్దు, సంతోష్‌కుమారి, శ్రీనివాసరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): కోర్టులో కేసులు ఉన్నవారికి మధ్యవర్తిత్వంపై అవగాహన నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి వాసుదేవన్, బొజ్జప్ప, రాకేష్ పాల్గొని అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు.

'ఎన్నికల హామీని నెరవేర్చాలి'

అగళి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు బలిజ కులస్థులను చిన్నచూపు చూస్తున్నాయని రాయల్ ఆర్పీఎఫ్ జాతీయ అధ్యక్షులు తిరుమలశెట్టి, రెడ్డిశేఖర్ అన్నారు. అగళి మండలం నరసాంబుది గ్రామంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారని, అనంతరం మరిచారన్నారు.

బాధ్యతల స్వీకరణ

గోరంట్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షుడిగా బెల్లాచెరువు జయచంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కమిటీ సభ్యులుగా వడిగేపల్లి సాలెప్ప, మల్లాపల్లి సరస్వతి బాధ్యతలు తీసుకున్నారు. సహకార సంఘం అభివృద్ధి, రైతు సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని జయచంద్ర ఈ సందర్భంగా అన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో జయచంద్రాను నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, మనోహర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): బూదిలి, వానవోలు, గోరంట్ల సహకార సంఘాలకు నూతన కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. గోరంట్ల సింగిల్‌విండో అధ్యక్షుడిగా మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, సభ్యులుగా నబీరసూల్, పూలగంగాధర్, వానవోలు సింగల్‌విండో అధ్యక్షుడిగా బాసన్నపల్లి వెంకటరమణ, సభ్యులుగా శ్రీనివాసులు, నగేష్, బూదిలి సింగల్‌విండో అధ్యక్షులడిగా రామన్నపల్లి శివశంకర్‌రెడ్డి, సభ్యులుగా కుళ్లాయప్ప, నవీన్‌కుమార్ నియమితులయ్యారు.

● పెనుకొండ: పట్టణంలోని ఇస్లాపురం సింగిల్‌విండో అధ్యక్షుడిగా చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకుడు కొత్తరెడ్డి పోతిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్‌గా గుట్టూరుకు చెందిన ఆదిశేషు, నాగలూరుకు చెందిన గోపాల్‌తో సీఈఓ హరిక్రిష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గానికి టీడీపీ నాయకులు నాగలూరు నారాయణస్వామి, మునిమడుగు వెంకటరాముడు, త్రివేంద్రనాయుడు, గుట్టూరు నాగరాజు, కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్, మావటూరు గోపాల్ తదితరులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూలై16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ప్రభుత్వంపై రోజు రోజుకు ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణంలో కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక అనంతరం జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పాల్గొన్నారు. అభివృద్ధి కుంటుపడటంతో కొందరు స్వచ్ఛందంగా వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి వచ్చారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధి దిశగా ముందుకు వెళతామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఎంపికైన చైర్మన్, వైస్‌చైర్మన్లు పూర్తి స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, కొత్తగా ఎంపికైన చైర్మన్ నరసింహరాజు, వైస్ చైర్మన్ ప్రభావతి పాల్గొన్నారు.



పరిగి(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం జిల్లా యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ పథకాలను నాయకులు వివరించారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జూలారెడ్డి, అక్కులప్ప, శివ, మురళి, హనుమంతు, రామాంజి, విశ్వనాథ్ పాల్గొన్నారు.



మడకశిర టౌన్, (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ ఫలాలు అందాలన్న, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న సీఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 18, 19వ వార్డుల్లో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. కౌన్సిలర్లు సావిత్రమ్మ బలరాం, నాయకులు గోవిందప్ప, చిక్కన్న, కరియన్న తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బాలాజీనగర్ వివేకానందనగర్, జేజేఆర్ నగర్‌లో బుధవారం టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలిఅడుగును నిర్వహించారు. ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఏడాదిపాలనలో ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, కట్టా మహేంద్ర, శిరీష, అంజనేయులు, తిరుమలేష్, ఉప్పర బాబయ్య పాల్గొన్నారు.



గుడిబండ(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందని మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మందలపల్లి గ్రామంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్, నాయకులు వీరకేతప్ప తదితరులు పాల్గొన్నారు.



అగళి(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూడి గ్రామంలో బుధవారం సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బసవరాజ్, టీడీపీ నాయకుడు మాస్టర్ నరసింహప్ప, గిరి స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహరాజు, మాజీ సర్పంచ్ పుట్టినరసప్ప పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

యువకుడి ఆత్మహత్య

గుడిబండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్(30) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప, ఏఎస్ఐ రమణ తెలిపారు. మంజునాథ్‌కు తరచూ కడుపునొప్పి వస్తుండటంతో జీవితంపై విరక్తిచెంది మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గుడిబండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రైతులు సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారి వీరనరేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హిరేతుప్పి, కెఎన్‌పల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శారద, మంజుళ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.